సాక్షి
నిర్మల్

గురువారం । 18 । ఏప్రిల్ । 2024


భైంసా టౌన్: పట్టణంలో సీతారాముల విగ్రహాలతో నిర్వహిస్తున్న శోభాయాత్రలో భక్తులు


జిల్లా కేంద్రంలోని బాగులవాడ రామాలయంలో ఉత్సవమూర్తులు

కల్యాణ వైభోగం

జిల్లా వ్యాప్తంగా బుధవారం శ్రీరామనవమి వేడుకలను భక్తులు వైభవోపేతంగా జరుపుకొన్నారు. ఆయా ఆలయాల్లో వేదమంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణమహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కల్యాణ ఘట్టాన్ని కనులారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయాలన్నీ జైశ్రీరాం నినాదాలతో మార్మోగాయి. ఆలయాల్లో ప్రత్యేకపూజలతోపాటు పల్లకీ సేవ, రామనామ సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించగా భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో పలు చోట్ల సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించగా భక్తులు వేలాదిగా పాల్గొని నృత్యం చేశారు. - నెట్‌వర్క్


ముధోల్: మండల కేంద్రంలో..


జిల్లా కేంద్రంలోని బాగులవాడ రామాలయంలో తాళిబొట్టు చూపిస్తున్న పూజారి


ఖానాపూర్: మండల కేంద్రంలో కల్యాణ వేడుకలో భక్తులు


జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు

న్యూస్‌రీల్

అలరించిన కుస్తీ పోటీలు


తలపడుతున్న మల్లయోధులు

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. లోకేశ్వరంతోపాటు తానూర్, ముథోల్ మండలాలు, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. దార్‌కుభీర్ గ్రామానికి చెందిన నాగేశ్ అనే మల్లయోధుడు ప్రథమ స్థానంలో నిలువగా రెండున్నర తులాల వెండి, రూ.5,001 నగదు అందజేశారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ హాజరై ఇక్కడి రామాలయంలో పూజలు చేశారు. ఏఎస్సై దిగంబర్ బందోబస్తు నిర్వహించారు. పోటీలను మండల కేంద్రంతోపాటు హవర్గ, సాతేగాం, హథ్‌గాం గ్రామాల ప్రజలు తిలకించారు. నాయకులు కాంతారావు, నర్సింగ్‌రావు, ప్రభాకర్‌రావు, సతీశ్‌రావు, రాజశేఖర్‌రావు, లింగారావు, సుకుమార్‌రావు, రవీందర్‌రావు, ముత్యం, నాగారావు, భూమారావు, శ్రీనివాస్‌రావు, రాజు, రాజన్న, ఈరన్న, మనోహర్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపించకుండా నిఘా ఏర్పాటు చేయాలని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వందశాతం వెబ్‌కాస్టింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్, భైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, డీఆర్వో భుజంగ్‌రావ్, ఈడీఎం నదీమ్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భైంసాటౌన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సొప్పర్‌వార్ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీ చంద్రకాంత్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ నియామకపత్రాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద వారికి నియామక పత్రాలు ఇచ్చారు. నూతన పీఆర్సీ అమలు, భాషాపండితులకు ప్రమోషన్లు, 317 జీవోతో సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంఘ విస్తరణకు కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన నాయకులకు సూచించారు. గౌరవాధ్యక్షుడు సరికొండ శ్రీనివాస్, సభ్యులు సత్యనారాయణ, సాయన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

జిల్లాలో షూటింగ్ లొకేషన్లు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని పలు లొకేషన్లు సినిమా షూటింగ్‌లకు అనువుగా ఉన్నాయని మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పేర్కొన్నారు. స్థానికంగా కళాకారులూ అందుబాటులో ఉండడంతో పలు చిత్రాలు ఇక్కడే రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. ఇటీవల నిర్మల్‌లో ప్రదర్శించిన 'మా వూరి రాజారెడ్డి' చిత్రంలో నటించిన నటీనటులు, నిర్మాతలు, కళాకారులు ఎర్ర రవీందర్, అయిత వెంకటరమణ తదితరులను బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని లొకేషన్లలో స్థానిక కళాకారులతో 'మా ఊరి రాజారెడ్డి' చిత్రం అద్భుతంగా నిర్మించారని ప్రశంసించారు. ఎందరో కవులు, కళాకారులు, దర్శకనిర్మాతలు జిల్లాలో ఉన్నారని, వారికి ఇప్పుడిప్పుడే గుర్తింపు వస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని చిత్రాలు తీయాలని ఆకాంక్షించారు. నటులు, కళాకారులు అంజన్న, రాజన్న, రామ్ రమేశ్, చిన్నయ్య, జన్ను అనిల్, టీఎన్జీవో అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, రమణ, నరేందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్‌కు చెందిన మేడిపల్లి మాజీ ఉపసర్పంచ్, ఆత్మ డైరెక్టర్ రాజుల నారాయణ, నాయకులు గణిమిల సయేందర్, పడిగెల గంగయ్య బుధవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శ్రీహరిరావు వీరికి పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. పదేళ్ల కుటుంబపాలనతో విసిగిపోయిన బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వ పాలనకు ఆకర్షితులై అధికసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

అమృత్ @ రూ.28.18 కోట్లు!


గణేశ్‌నగర్‌లో ట్యాంక్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

- భైంసా పట్టణంలో తాగునీటి వ్యవస్థ విస్తరణకు మార్గం సుగమం
- నిధులిచ్చేందుకు కేంద్రం ఆమోదం
- మెరుగుపడనున్న తాగునీటి కష్టాలు

భైంసాటౌన్: భైంసా మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. కేంద్రం అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫరేషన్) 2.0 పథకం కింద ఎంపిక చేసిన పట్టణాల్లో తాగునీటి పథకాలను విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం భారీగా నిధులు ఖర్చు చేయనుంది. రాష్ట్రంలో 11 మున్సిపాలిటీలను ఎంపిక చేయగా, నిర్మల్ జిల్లా నుంచి భైంసా మున్సిపాలిటీకి అవకాశం దక్కింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నుంచి రుణ రూపంలో రూ.28.18 కోట్లు సమకూరనుండగా, ఈ నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైపులైన్ల నిర్మాణం, నల్లా కనెక్షన్లు చేపట్టనున్నారు. పట్టణంలో ప్రస్తుతం మిషన్ భగీరథ కింద తాగునీటి వ్యవస్థ ఉన్నా.. అమృత్ పథకం కింద వచ్చే నిధులతో మరింత మెరుగుపడనుంది.

మిషన్ భగీరథ ఉన్నా..

పట్టణంలో ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే, 2018 జనాభాకు అనుగుణంగా అప్పటి అవసరాల నిమిత్తం పనులు చేపట్టారు. దీంతో వివిధ కారణాలతో ఇప్పటికీ అన్ని కాలనీలకు పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదు. కొన్నిచోట్ల పైపులైన్ పనులు, నల్లా కనెక్షన్ పనులు పూర్తయినా నీటి సరఫరా జరగడం లేదు. కొన్నిచోట్ల ఇప్పటికీ బోరుమోటర్లు, చేతిపంపుల ద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన జనాభా, వాడల ఆధారంగా తాగునీటి వ్యవస్థ మెరుగుపర్చేందుకు అమృత్ 2.0 పథకం కింద నిధులు కేటాయించడంతో మరిన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి, పైపులైన్లను విస్తరించి తాగునీటి వసతి కల్పించనున్నారు.

కేంద్ర నిధులతో ఊరట

మున్సిపాలిటీకి ఆస్తిపన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్, ఇతర పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతున్నా.. సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, డీజిల్, కరెంట్ బిల్లులకే అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. దీంతో నిధుల లేమితో తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నారు. ముఖ్యంగా వేసవిలో సమస్య తీవ్రంగా ఉంటోంది. కాగా, అమృత్ పథకం 2.0 కింద నిధులు కేటాయించడంతో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఆర్థికంగా ఊరట లభించనుంది. ఈ నిధులతో పట్టణంలో 1,100 కిలో లీటర్ల సామర్థ్యంతో నీటి ట్యాంకు ఒకటి, అలాగే 700 కిలో లీటర్ల నిల్వ సామర్థ్యంతో మరో రెండు నీటి ట్యాంకులు, 500 కిలో లీటర్ల సామర్థ్యంతో మరో టాంక్ నిర్మించనున్నారు. 39 కిలో మీటర్ల పైపులైన్ వ్యవస్థ, 2,320 ఇళ్లకు నల్లా కనెక్షన్లు, అవసరమైన చోట్ల ప్రహరీ నిర్మాణం, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్లు, సర్వీస్ రిజర్వాయర్ల వద్ద ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లు తదితర పనులు చేపట్టనున్నారు.

మార్గదర్శకాలు రాలేదు

పట్టణంలో తాగునీటి వసతి కల్పించేందుకు వివిధ పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఆ పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. అమృత్ 2.0 కింద రూ.28.16 కోట్లు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు.

– వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్, భైంసా

అన్నదాతకు భగీరథుడి అండ



కడెం ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పడిపోగా యాసంగిలో ఇరిగేషన్ అధికారులు క్రాప్ హాలీడే ప్రకటించారు. కానీ.. ప్రాజెక్ట్ దిగువనున్న కన్నాపూర్ చెరువు కింద పలువురు రైతులు పంటలు సాగుచేశారు. చెరువునీరు అడుగంటే క్రమంలో మూడునెలల క్రితం ఇందులోంచి వెళ్లిన మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో లీకేజీ నీటితో చెరువు నిండి కళకళలాడుతుండగా ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తంజేస్తున్నారు. - కడెం

'భైంసాలో రామమందిరం నిర్మించుకుందాం'

భైంసాటౌన్: భైంసాలో త్వరలోనే రామమందిరం నిర్మించుకుందామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాంలీలా మైదానంలో నిర్వహించిన శోభాయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీరాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో హిందువుల చిరకాల కోరిక అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి చేసుకోవడం మనందరి భాగ్యమని పేర్కొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు హిందూ వాహిని కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, హిందూ ధర్మ రక్షకులు విశేష కృషి చేస్తున్నారని, తన గెలుపు కోసం కూడా సైనికుల్లా పనిచేశారని గుర్తుచేశారు. వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. హిందువులంతా సంఘటితం కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కలంస్నేహం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీమాన్ గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. శ్రీరాముడు ఆదర్శ పురుషుడిగా ధర్మ గుణాలు ఆచరించాడని తెలియజెప్పే కవితాగానం చేశారు. కలం స్నేహం అధ్యక్షులు దేవిప్రియ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కడారి దశరథ్, కొండూరు పోతన్న, ఉపాధ్యక్షులు బట్టు శోభారాణి, కార్యదర్శి బీ శంకర్, కవులు నేరెళ్ల హనుమంతు, తొడిశెట్టి రవికాంత్, శ్యామల, రాజేశ్వరి, దేవిక, శివరాణి, గాయత్రి, శోభ, నర్మద, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.


కవిసమ్మేళనంలో కలంస్నేహం సభ్యులు

నేటి నుంచి నామినేషన్లు

- ఈ నెల 25 వరకు స్వీకరణ
- ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో పకడ్బందీ ఏర్పాట్లు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి షురూ కానుంది. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ ఛాంబర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన, 29వరకు ఉపసంహరణ గడువు ఉన్నట్లు తెలిపారు. మే 13న పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏఆర్‌వోగా ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు.

ప్రత్యేక సహాయ కేంద్రం..

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థులకు సంబంధించి వంద మీటర్ల వరకు మూడు వాహనాలను అనుమతిస్తారు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని లోనికి అనుమతించనున్నారు. అభ్యర్థి డిపాజిట్ కింద రూ.12,500 నగదు లేదా ప్రభుత్వ బ్యాంకులు, కార్యాలయాల్లో తీసిన డీడీ రూపంలో చెల్లించవచ్చు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజర్ సరిపోతుంది. గుర్తింపులేని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులైతే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన పది మంది ప్రతిపాదకులను తీసుకురావాల్సి ఉంటుంది. హెల్ప్ డెస్క్‌లో ప్రత్యేక కంప్యూటర్లతో పాటు ఆపరేటర్లను నియమించారు. దీనికి ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. వెయిటింగ్ రూమ్ సైతం ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ పరిశీలనకు భీంపూర్ తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. నామినేషన్లకు సంబంధించిన పత్రాల పరిశీలన, ఓటరు లిస్ట్, సీరియల్ నంబర్, పార్ట్ నంబర్ వంటి వాటి పరిశీలన కోసం ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం

అభ్యర్థులకు ప్రత్యేక హ్యాండ్ బుక్..

ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులకు హ్యాండ్ బుక్‌తో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేలా పత్రాలను అందజేయనున్నారు. అభ్యర్థులు నామినేషన్‌కు ముందే ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థి సంతకం చేస్తే ముందు చేయవచ్చు.. వేలిముద్ర వేసేవారైతే రిటర్నింగ్ అధికారి ముందే వేయాల్సి ఉంటుంది. అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో మూడుసార్లు తప్పనిసరిగా ప్రకటించాల్సి ఉంటుంది. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సంబంధించి స్పెసిమెన్ సిగ్నిచర్లకు సంబంధించి హార్డ్, సాఫ్ట్ కాపీలను ఫారం-7ఏలో అందజేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ.95లక్షల వరకు ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేయవచ్చు. రూ.10వేలకు మించితే ఆన్‌లైన్ పద్ధతిలోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది.

హోం ఓటింగ్..

85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం గల దివ్యాంగులు హోం ఓటింగ్ వినియోగించుకోవచ్చు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి వారందరికీ ఫారం-12డీ అందజేశారు. ఈనెల 25వ తేదీ వరకు వాటిని స్వీకరించనున్నారు. ఇలా అందిన వివరాల ఆధారంగా హోం ఓటింగ్‌కు చర్యలు చేపడుతారు. వీరితో పాటు అత్యవసర సర్వీసుల్లో పనిచేసే బీఎస్ఎన్ఎల్, సివిల్ సప్లయ్, రైల్వే, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రిసిటీ, వైద్యారోగ్య శాఖ వంటి శాఖల ఉద్యోగాలకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

నామినేషన్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు..

నామినేషన్ల స్వీకరణ కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదిలాబాద్ కలెక్టరేట్ వద్ద 100 మీటర్ల వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని తెలిపేలా ప్రత్యేక సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. వంద మీటర్ల తర్వాత మీడియా సెంటర్ ఉంటుంది. ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పర్యవేక్షించారు.

పోస్టల్ బ్యాలెట్ అందజేత..

పార్లమెంట్ ఎన్నికల్లో 5,940 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. ఇందులో పీవో, ఏపీవో, ఓపీవోలు 4,122 మంది ఉండగా, పోలీసు బెటాలియన్‌కు సంబంధించి 635, ఇతర సిబ్బంది 183 మంది ఉన్నారు. వీరందరికీ ఇదివరకే శిక్షణ ఇవ్వగా, ఆ సమయంలోనే పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12 అందజేశారు. సదరు ఉద్యోగులు తమ సొంత నియోజకవర్గం లేదా శిక్షణ కేంద్రంలో ఓటు వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. సొంత నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఒకరోజు క్యాజువల్ సెలవు ఇవ్వనున్నారు. వీరికి మే 3 నుంచి 8వరకు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 16లక్షల 44వేల 715 మంది ఉండగా.. ఇందులో 2,150 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుతో మహిళ మృతి


లక్ష్మి మృతదేహం

ఖానాపూర్: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని సింగాపూర్ తండాలో చోటు చేసుకుంది. కడెం ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రామెల లక్ష్మి (40) బుధవారం మొక్కజొన్న బూరు తీయడానికి పంటచేనుకు వెళ్లింది. ఉరుములతో కూడిన వర్షం రావడంతో చెట్టు కిందికి వెళ్లింది. చెట్టుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త చిన్నపోశెట్టి, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భర్త చిన్నపోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు స్వగ్రామానికి గల్ఫ్ మృతదేహం

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ ఇటీవల గల్ఫ్ దేశంలోని బెహరాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో మృతదేహం తెప్పించే స్తోమత లేదు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ఖానాపూర్ నివాసి వొడ్డెపల్లి కృష్ణంరాజును కలిసి గోడు వెల్లబోసుకున్నారు. స్పందించిన కృష్ణంరాజు బెహరాన్, ఇండియన్ ఎంబసీలతో పాటు ఇరువురు అధికారులతో మాట్లాడి అక్కడున్న మిత్రుల ద్వారా మృతదేహం స్వగ్రామానికి వచ్చేందుకు మార్గం సుగమం చేశారు. గురువారం ఖానాపూర్‌కు మృతదేహం వచ్చేలా అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి


ప్రచారంలో పాల్గొన్న ఆత్రం సుగుణ

బజార్‌హత్నూర్: ఎన్నికల్లో గెలిపిస్తే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని భూతాయి, చందునాయక్ తాండ, మొర్కండి, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, నాయకులు జల్కే పాండురంగ్, విఠల్, కిషన్, నారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి


మౌనిక (ఫైల్)

కాసిపేట: మండలంలోని కోమటిచేనుకు చెందిన బెడ్డల మౌనిక (28) విద్యుత్‌షాక్‌తో బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వాటర్‌ట్యాంక్‌లో నీటిని పరిశీలించేందుకు ఇంటిపైకి ఎక్కింది. తెగిపోయిన విద్యుత్ వైరు ఇనుప రేకులకు తాకింది. వాటిని తాకిన మౌనికకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి జాడి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ గోసకు భరోసా

- కార్మికసంఘాలతో భేటీలో సీఎం హామీ
- గల్ఫ్ కార్మిక కుటుంబాల్లో హర్షాతిరేకాలు
- గల్ఫ్‌దేశాల్లో వేలాదిమంది జిల్లావాసులు
- బీమా, సంక్షేమబోర్డుపై కీలక నిర్ణయాలు
- సెప్టెంబర్ నాటికి విధానానికి తుదిరూపు


సీఎం రేవంత్‌రెడ్డితో గల్ఫ్ జేఏసీ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: రెక్కడితేగానీ డొక్కాడని బతుకులు.. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ రోజుకూలితో బతుకీడిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుండి దాదాపు70 వేలకుపైగా కార్మికులు గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉపాధి నిమిత్తం అక్కడ నివసిస్తున్నారు. నాలుగేళ్లలో దాదాపు 120 మందికి పైగా కార్మికులు గల్ఫ్ దేశాల్లోనే పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతదేహాలు ఇంటికి రావడానికి నెలల తరబడి వేచిచూసిన దయనీయ ఘటనలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రదేశ్ పరికిపండ్ల, గల్ఫ్‌జేఏసీ నాయకులు దొనికెన కృష్ణ, పోతుగంటి సాయిందర్, గుండేటి గణేశ్, తదితరులు పాల్గొని సమస్యలను ప్రస్తావించారు. అయితే గల్ఫ్ కార్మికులకు జీవితబీమా, కేరళ తరహా ప్రత్యేక సంక్షేమ బోర్డు, ప్రజాభవన్‌లో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ, మృతులకు రూ.5 లక్షల ప్రమాదబీమా వంటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నిర్ణయంతో గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

స్వయంగా సీఎం సమీక్ష ...

చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం నిర్ణయాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా కాంగ్రెస్ ఎన్నారై సెల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు ఆయా గల్ఫ్ దేశాలకు సంబంధించిన ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. హాజరైన సీఎం రేవంత్ రెడ్డి గల్ఫ్ కార్మికుల పక్షాన పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని భరోసానిచ్చారు. వీరి కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు, సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రజాభవన్‌లో ప్రత్యేక కార్యాలయం, టోల్ ఫ్రీ నెంబర్ సౌకర్యం, సెప్టెంబర్ 17 లోపు పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు. పలు రాష్ట్రాల గల్ఫ్ విధానాలను అధ్యయనం చేసి ముసాయిదా రూపొందించి అందరి సలహాలు సూచనలు స్వీకరించి అమలుపరుస్తామన్నారు.

గల్ఫ్‌గోస గతం నుంచే ...

గల్ఫ్ కార్మిక సంఘాల గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 80 వేలకు పైగా దుబాయ్, ఒమన్, మస్కట్, సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, బహ్రెయిన్, కువైట్, మలేషియా, ఖతర్, తదితర 18 గల్ఫ్‌దేశాల్లో ఉపాధి పొందుతున్నారని అంచనా. ప్రధానంగా నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లోని ముథోల్, ఖానాపూర్, నిర్మల్, మంచిర్యాల, బెల్లంపల్లి, బోథ్, తదితర ప్రాంతాల నుంచే ఎక్కువగా తరలివెళ్లారు. ఈ వలసలు 1990 నుంచి మరింత ఎక్కువయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నాటి నుంచి ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయాలని, రాష్ట్ర బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలను ప్రకటించడంతో గల్ఫ్ కార్మిక కుటుంబాల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

సబ్సిడీ రుణం ఇప్పించాలి



18 ఏళ్లపాటు గల్ఫ్ దేశంలో పనిచేసి స్వగ్రామానికి తిరిగొచ్చా. ప్రస్తుతం కూలీపని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మాలాంటి గల్ఫ్ రిటనీలకు ఏదైనా కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణం ఇప్పిస్తే స్వయం ఉపాధి రంగంలో నిలదొక్కుకుంటాం. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– బొశెట్టి పోశెట్టి, గల్ఫ్ రిటనీ, చించోలి(బీ), సారంగపూర్

సత్వరమే అందితే సంతోషం



నా భర్త బెజ్జారం రమేశ్ గతేడాది ఆగస్టులో దుబాయ్‌లో మృతి చెందాడు. డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకున్నా. నా ఇద్దరు పిల్లలు, అత్తామామలు ఆర్థిక సాయం కోసం వేచి చూస్తున్నాం. పరిహారం సత్వరమే అందితే నా కుటుంబానికి తోడ్పాటుగా ఉంటుంది.

– బెజ్జారం లక్ష్మి, కౌట్ల (బీ), సారంగపూర్

సెప్టెంబర్ నాటికి అమలు..



గల్ఫ్ కార్మికులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను సీఎంకు వివరించాం. అన్ని అంశాలను విశ్లేషించి గల్ఫ్ కార్మిక సంక్షేమ పథకాలను ప్రభుత్వ పాలసీగా సెప్టెంబర్ నాటికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ విధానాల అమలువల్ల గల్ఫ్ కార్మికులు, కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరుతుంది. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారికి ముందస్తు అవగాహన కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ వంటివి కూడా చేపడతామన్నారు.

– స్వదేశ్ పర్కిపండ్ల, ప్రవాసీమిత్ర రాష్ట్ర అధ్యక్షుడు

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ఇచ్చోడ: మండలంలోని చించోలి వద్ద మంగళవారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ అరికప్పుల రాజేందర్ (33) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని వడ్డెరగూడ గ్రామానికి చెందిన రాజేందర్ ముక్రా(బి) గ్రామంలో ట్రాక్టర్ లోంచి ఇటుక లోడ్ ఖాళీ చేసి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎదులాపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన పట్టణంలోని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. ఇంద్రవెల్లి మండలం దొడండ గ్రామానికి చెందిన మేఘనాథ్, జయరాం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బంధువును చూడటానికి సోమవారం వచ్చారు. రాత్రి కావడంతో ఆస్పత్రిలోనే ఉండిపోయారు. పక్కనే ఉన్న దస్నాపూర్ పెట్రోల్ బంక్ సమీపంలోని టీస్టాల్‌కు వెళ్లి వస్తుండగా రాంగ్‌రూట్‌లో వస్తున్న ఓ ద్విచక్ర వాహన చోదకుడు వీరిని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనం నంబర్ ఆధారంగా బుధవారం బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కేసు నమోదు

దండేపల్లి: కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాల మేనేజర్ (కరస్పాండెంట్) జైసన్, ప్రిన్సిపాల్ జోబీపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హనుమాన్ దీక్ష తీసుకోగా వారిని యూనిఫాం వేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇబ్బందులకు గురిచేయడం మంగళవారం ఆందోళనకు దారితీసింది. దీంతో ఓ విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గిరి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

- కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ


ప్రచారం నిర్వహిస్తున్న ఆత్రం సుగుణ

నేరడిగొండ(బోథ్): గిరి ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం లేండిగూడ, మహాదుగూడ, కేశవ్‌గూడ, జైతుగూడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ ఆడబిడ్డను ఆశీర్వదించాలని కోరారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్‌తో సమానమైన విద్య అందిస్తామని, వజ్జర్ ప్రాంతంలో చెక్ డ్యామ్‌లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అధికార ప్రతినిధి చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ షేక్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ పోతారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఇషురు పటేల్, గాజుల పోతన్న, విజయ్ భాస్కర్, అనిల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా


ఇసుక లోడుతో వెళ్తున్న నంబర్ లేని ట్రాక్టర్


అందుగులపేటలో నిల్వ ఉంచిన ఇసుక

- సిమెంట్ ఇటుకల తయారీదారుల వద్ద నిల్వలు
- వాగుల నుంచి ట్రాక్టర్లలో తరలింపు

మందమర్రిరూరల్: మండలంలోని పాలవాగు, రాళ్లవాగు, పెద్దవాగు, కొండెంగల వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక తోడేస్తుండడంతో భూగర్భ జలం అడుగంటిపోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాక్టర్ల యజమానులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వర్షాలు పడిన సమయంలో వరద రాగానే ఇసుక మేటలు వేస్తుంది. వర్షాలు తగ్గిన తర్వాత ట్రాక్టర్ల యాజమనులు అక్రమంగా తరలిస్తూ ఒక్కో ట్రిప్పు రూ.3వేలకు విక్రయిస్తున్నారు. మండలంలోని సిమెంటు ఇటుకల తయారీదారులు అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు నంబర్లు లేని ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి అనుకూలమైన ప్రదేశంలో నిల్వ చేస్తున్నారు. ఎవరైనా అడిగితే అప్పటికప్పుడు చేరవేస్తున్నారు. వాగుల్లో నుంచి ఇసుక తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇసుక తరలింపుపై మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్‌ను సంప్రదించగా.. వాగుల్లో నుంచి ఇసుక తరలింపునకు అనుమతి లేదని, అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

ఆసిఫాబాదరూరల్: మండలంలోని కొటగూడలో బుధవారం సాయంత్ర జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన గెడెం లక్ష్మణ్ కుటుంబ సభ్యులు శ్రీరామనవమి సందర్భంగా ఇంట్లో దేవుడికి పూజలు చేసి దీపం పెట్టి ఆలయం వద్ద జరుగుతున్న వేడుకలకు వెళ్లారు. దీపం ఇంట్లో ఉన్న వస్తువులకు అంటుకోవడంతో మంటలు చెలరేగి ఇంటిముందున్న రేకుల షెడ్డు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో పైకప్పు రేకులు చెల్లాచెదురయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగి నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. బస్టాండ్‌లోని ఆసిఫాబా ద్‌కు వెళ్లే ప్లాట్‌ఫాం వద్ద వ్యక్తి పడిపోయి ఉండడంతో ప్రయాణికుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహం వద్ద అతనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మద్యం సేవించి ఎండలో బస్టాండ్‌కు వచ్చి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

గాలివాన బీభత్సం

- ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో దెబ్బతిన్న 15 ఇళ్లు
- విరిగిన విద్యుత్ స్తంభాలు, నిలిచిన సరఫరా


బూర్గుడలో దెబ్బతిన్న ఇల్లు

ఆసిఫాబాద్‌రూరల్: బలమైన ఈదురుగాలులతో బుధవారం కురిసిన వాన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో బీభత్సం సృష్టించింది. ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో గాలివాన ధాటికి గ్రామంలోని 15 ఇళ్లు దెబ్బతిన్నాయి. గాజుల పెంటయ్య, చిగురు గోపాల్, పుధరి పెంటక్క, బుజాడి బొడ్డు, బిజ్జు, దర్ని రమేశ్, ఎరుబోతు వినోద్, పులగం శంకర్, దాడి రాగులయ్య, చీల్లరి నర్సయ్య, గాజుల పెంటయ్య, బోద సురేశ్‌కు చెందిన ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. నిత్యావసరాలు తడిసిపోయాయి. గాలికి ఎగిరి వచ్చిన రేకు పుదారి చంద్రయ్యకు చెందిన ఎద్దుకు తగలడంతో తీవ్రంగా గాయపడింది. ఇంటి పైనుంచి రాయి పడటంతో పూదారి పెంటక్క, చెట్టు కొమ్మలు మీదపడి లోకండే చిన్నక్కకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బూర్గుడ సమీపంలోని దాబా తీవ్రంగా దెబ్బతింది. రోడ్డుపై ఆగి ఉన్న లారీ బోల్తా పడింది. బూర్గు, మోతుగూడ గ్రామాల్లో ఎనిమిది విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. బూర్గుడతోపాటు ఈదులవాడ, అప్పపల్లి, రహపల్లి, కొమ్ముగూడ, గొల్లగూడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.


రేకు తగిలి గాయపడిన ఎద్దు


రహదారి పక్కన ఆనవాళ్లు కోల్పోయిన దాబా


బూర్గుడలో విరిగిన విద్యుత్ స్తంభం


గాలి ఉధృతికి బోల్తా పడిన లారీ

గంజాయి మత్తు.. యువత చిత్తు

- వినూత్న రీతిలో అమ్మకాలు
- కొత్తరకం సిగరెట్ ఫిల్టర్ల ద్వారా సేవిస్తున్న వైనం
- బానిసవుతున్న యువత



చెన్నూర్‌లో పట్టుబడిన గంజాయి నింపే ఫిల్టర్లు

చెన్నూర్: యువత గంజాయి మత్తులో పడి చిత్తవుతోంది. విచ్చలవిడిగా లభించడంతో చదువుకునే విద్యార్థులు సైతం గంజాయికి బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల చెన్నూర్ ప్రాంతంలో కిరాణా దుకాణంతో పాటు పలువురు యువకుల వద్ద రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా ఈ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహారాష్ట్ర, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి..

పక్కనే ఉన్న మహారాష్ట్ర, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం. కొందరు యువత మహారాష్ట్ర, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వెళ్లి గంజాయిని తీసుకొని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి

కొంతమంది యువత జల్సాల కోసం తక్కువ ధరకు లభించే గంజాయిని తెచ్చి ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. కొందరు గంజాయి వ్యాపారులు 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువతను టార్గెట్ చేసి దందా కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఆన్‌లైన్ ద్వారా ఫిల్టర్లు తెప్పించి..

గంజాయి అమ్మకాలలో వ్యాపారులు కొత్తపుంతలు తొక్కుతున్నారు. సాధారణ సిగరెట్ ఫిల్టర్ మాదిరిగా ఉండే ఫిల్టర్లను ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నారు. అందులో గంజాయి నింపుతున్నారు. ఒక్కో గంజాయి ఫిల్టర్ను రూ.100 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

గంజాయిపై నిఘా ఉంచాం



గంజాయి అమ్మకాలపై గట్టి నిఘా ఉంచాం. ఇటీవల ముగ్గుర్ని అరెస్టు చేశాం. ఇతర ప్రాంతాల నుంచి చెన్నూర్‌కు రాకుండా చర్యలు చేపట్టాం. ఎవరైనా గంజాయి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయి మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు.

– రవీందర్, సీఐ, చెన్నూర్

‘మత్తడివాగు’ను తవ్వేస్తున్నారు!


ప్రాజెక్టులో పొక్లెయిన్లతో చేపడుతున్న అక్రమ తవ్వకాలు

పలు గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటిని అందించే తాంసి మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులో కొంత మంది అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా పొక్లెయిన్ల సాయంతో తవ్వి ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నా రు. ఈ విషయమై సాగునీటి పారుదలశాఖ డీఈని ఫోన్‌లో సంప్రదించగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతి లేదని చెప్పడం గమనార్హం.

– తాంసి/సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


ట్రాక్టర్‌లో తరలిస్తున్న మత్తడివాగు మట్టి


ఓ నాయకుడి క్వారీలో పూడ్చుతున్న మట్టి